సాక్షి చిత్తూరు

బుధవారం ౹ 22 ౹ మే ౹ 2024



అత్యంత జాగ్రత్తగా కౌంటింగ్

ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. - 8లో



ఇంటర్ సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 24 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. - 8లో



వేపాకు చీరలు చుట్టి..

తిరుపతి గ్రామ దేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఇసుక రీచ్‌లపై ప్రత్యేక నిఘా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌లను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. రీచ్‌లలో అక్రమ తవ్వకాలు, రవాణాకు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యం తనిఖీలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

తిరుమలకు 10 టన్నుల బెల్లం




రవాణాను ప్రారంభిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలోని మంగుంట గ్రామం నుంచి తిరుమలలో లడ్డూ ప్రసాదాల తయారీకి 10 టన్నుల బెల్లం సరఫరా చేస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయాధికారి(డీపీఎం) వాసు, మార్క్‌ఫెడ్ రమేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని మంగుంటలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతులు శేషాద్రి, సుబ్రమణ్యంరెడ్డి గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. సేంద్రియ విధానంలో సిద్ధం చేసిన 10 టన్నుల బెల్లాన్ని తిరుమలలో ప్రసాదాల తయారీకి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ సాగుతో భావితరాలకు ఆరోగ్యకరమైన ఆహారం, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందిచవచ్చని వెల్లడించారు. రైతులు మాట్లాడుతూ తాము తయారు చేసిన బెల్లాన్ని తిరుమలకు తీసుకెళ్లడం గొప్ప అనుభూతినిస్తోందని తెలిపారు. అనంతరం జెండా ఊపి బెల్లం లారీని తిరుమలకు సాగనంపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రతినిధులు ఫైజున్నీసా, గురుప్రసాద్, ఝాన్సీ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ ఏటీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 86,721 మంది స్వామివారిని దర్శించుకోగా 39,559 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.4 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అమ్మవారి సేవలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి





కుప్పంలో అశేష భక్తుల నడుమ ఊరేగుతున్న గంగమ్మతల్లి

జాతరో జాతర

జిల్లాలోని చిత్తూరు.. పలమనేరు.. కుప్పంలో అంగరంగ వైభవంగా గంగజాతర నిర్వహిస్తున్నారు. మంగళవారం చేపట్టిన వేడుకలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మా.. గంగమ్మతల్లీ.. కరుణించమ్మా.. అంటూ ప్రణమిల్లారు. పాడి పంటలతో వర్ధిల్లేలా దీవించాలని ప్రార్థించారు. సకాలంలో వర్షాలు కురిపించమని వేడుకున్నారు. వివిధ వేషధారణలతో అమ్మను సేవించుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యం అందించారు. అంబలి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో తల్లిని పూజించి పులకించారు. చిత్తూరులో సింహవాహనంపై అమ్మవారు కొలువుదీరి సకల జనులను కటాక్షించారు. పలమనేరులో తిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనం ఇచ్చారు. కుప్పంలో శక్తిస్వరూపిణి శిరస్సును కనులపండువగా ఊరేగించారు.

- చిత్తూరులో వాడవాడలా గంగమ్మ సంబరం
- కుప్పంలో అమ్మవారి ఉత్సవానికి పోటెత్తిన భక్తజనం
- పలమనేరులో తిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనం
- ఎక్కడికక్కడ పకడ్బందీ ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- పటిష్ట బందోబస్తు కల్పించిన పోలీసులు

చిత్తూరు రూరల్(కాణిపాకం)/పలమనేరు/కుప్పం : చిత్తూరు నగరంలో మంగళవారం గంగజాతర అట్టహాసంగా ప్రారంభమైంది. నడివీధి, కొంగారెడ్డి పల్లె, సంతపేట, గిరింపేట, దొడ్డిపల్లె, మురకం బట్టు, ఓబనపల్లె తదితర ప్రాంతాల్లో జాతరను వేడుకగా నిర్వహించారు. అమ్మవారు సింహవాహనం అధిష్టించి భక్తులను అనుగ్రహించారు. గంగమ్మను దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యంగా అంబలి, పిండివంటలను సమర్పించారు. భక్తులు తమ మొక్కులను చెల్లించేందుకు వివిధ వేషధారణలతో వచ్చారు.

నేడు నిమజ్జనం

చిత్తూరులో ఆనవాయితీ ప్రకారం రెండవరోజు అమ్మవారిని నిమజ్జనం చేస్తుంటారు. ఈక్రమంలో బుధవారం 4 గంటలకు నడివీధితో పాటు పలు ప్రాంతాల్లో కొలువైన గంగమ్మ ప్రతిమలను నిమజ్జనానికి తరలించనున్నారు. ఈ సందర్భంగా వంశపారంపర్యధర్మకర్తలు అమ్మవారికి సారె సమర్పించనున్నారు. నిమజ్జనోత్సవంలో ఓంశక్తి విన్యాసాలు ఆకట్టుకోనున్నాయి.

పలమనేరులో..

పలమనేరు పట్టణంలో తిరుపతి గంగమ్మ జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. అమ్మవారు మంగళవారం తెల్లవారుజాము నుంచి గంగమ్మ తోపులోని పుట్టింట్లో భక్తుల దర్శనార్థం కొలువు దీరారు. శిరస్సు మెరవణి తర్వాత భక్తులకు విశ్వరూపదర్శన భాగ్యం కల్పించారు.

నేడు జలధితో పరిపూర్ణం

గంగమ్మ జాతర బుధవారం జలధి కార్యక్రమంతో పరిపూర్ణం కానుంది. బుధవారం ఉదయం 5 గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గాంధీ నగర్ సమీపంలోని బావిలో నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

కుప్పంలో శిరస్సు ఊరేగింపు

కుప్పం పట్టణంలో తిరుపతి గంగమ్మజాతర సందర్భంగా అమ్మవారి శిరస్సును వైభవంగా ఊరేగించారు.చెరువు కట్ట వద్ద పెద్ద బావి దగ్గర ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి కళ్లకు తెర తొలగించి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఊరేగింపు తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో కుప్పం జన సంద్రంగా మారింది.



అంబలి పోస్తున్న భక్తులు



పలమనేరులో గంగమ్మ విశ్వరూప దర్శనం



చిత్తూరు కొంగారెడ్డిపల్లెలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



సంతపేటలో కొలువుదీరిన గంగమ్మ

నేడు చిత్తూరులో ట్రాఫిక్ ఆంక్షలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంగ జాతర సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆంక్షలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. భారీ వాహనాలను రెడ్డిగుంట కూడలి, ఇరువారం కూడలి, కాణిపాకం కూడలి, మురకంబట్టు, కట్టమంచి, సాంబయ్యకండ్రిగ మీదుగా మాత్రమే వెళ్లాలని, నగరంలోకి రాకూడదని స్పష్టం చేశారు. వేలూరు, పలమనేరు రోడ్డు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రెడ్డిగుంట, ఇరువారం, కాణిపాకం కూడలి, మురకంబట్టు, ఎల్‌జీబీ టవర్స్ మీదుగా బస్టాండుకు వెళ్లాలని సూచించారు. పుత్తూరు వైపు నుంచి వచ్చే బస్సులు సాంబయ్యకండ్రిగ కూడలి నుంచి ఎల్‌జీబీ టవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండుకు చేరుకోవాలని కోరారు. ప్రైవేటు బస్సులను రెడ్డిగుంట, ఇరువారం, మురకంబట్టు, సాంబయ్యకండ్రిగ వద్ద నిలిపివేయనున్నట్లు వివరించారు.

వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ విక్రయించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిబంధనలు జూన్ 10వ తేదీ వరకు అమలులో ఉంటాయన్నారు. పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఎట్టిపరిస్థితుల్లోనూ సీసాలు, డ్రమ్ములు, ఇతర పాత్రలకు పెట్రోల్, డీజిల్ నింపకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆయా పెట్రోల్ బంక్‌ల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ఉత్తర్వుల మేరకు కేవలం వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ పట్టించుకోవాలని పేర్కొన్నారు.

మామిడీలా



వేసవిలో మాధుర్యం పంచే మామిడి మరింత ప్రియంగా మారుతోంది. పూతదశలోనే రాలిపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఈదురుగాలుల కారణంగా కళ్లెదుటే కాయలు నేలపాలవుతుండడంతో రైతాంగం దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. ఎకరాకు అర టన్ను కూడా పంట చేతికందే అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతోంది. ఈ పర్యాయం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని దిగాలు పడుతోంది.

- దిగుబడి తగ్గిన మధురఫలం
- ఈదురుగాలులతో రాలిపోతున్న కాయలు
- 1.5లక్షల టన్నులకు పడిపోయిన ఉత్పత్తి
- పంట ఎగుమతులపై తీవ్రమైన ప్రభావం
- పెట్టుబడి కూడా రాదని రైతులు ఆందోళన



సీజన్‌లో బోసిగా కనిపిస్తున్న మామిడి చెట్లు

సాక్షి, చిత్తూరు : జిల్లాలోని 22 మండలాల్లో ఏటా మొత్తం 68,479 హెక్టార్లలో మామిడిని రైతులు సాగు చేస్తున్నారు. వాటిలో తోతాపురి రకం 46,566 హెక్టార్లు, బేనీషా 10,275 హెక్టార్లు, నీలం 6,755 హెక్టార్లు, ఇతర రకాలు 4,883 హెక్టార్లలో సాగులో ఉంది. సకాలంలో చెట్లకు పూత వచ్చి మంచి దిగుబడి వస్తే అన్ని రకాల కాయలు దాదాపు 4 లక్షల నుంచి 5 లక్షల టన్నుల మేరకు దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది వాతావరణంలో మార్పుల కారణంగా చెట్లకు పూత ఆలస్యంగా వచ్చింది. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో దిగుబడి కేవలం 1.50 లక్షల టన్నులకు పడిపోయింది. ఇక టేబుల్ వెరైటీస్‌గా పిలవబడే బేనీషా, నీలం, మల్లిక, ఖాదర్ వంటి రకాల రకాలు 2 లక్షల టన్నుల నుంచి 70 వేల టన్నులు మాత్రమే వచ్చే అవకాశమున్నట్లు అంచనా.

తగ్గనున్న ఎగుమతులు

జిల్లాలో పండించే మామిడికి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో భలే డిమాండ్ ఉంది. ఏటా ఇక్కడి నుంచి ఢిల్లీ, కోల్‌కత్తా మహారాష్ట్ర, అస్సాం, కర్ణాటక, తమిళనాడుకు అత్యధికంగా ఎగుమతి అవుతోంది. కొన్ని గల్ఫ్ దేశాలతోపాటు, జపాన్, న్యూజీలాండ్, నెదర్లాండ్, దక్షిణ కొరియాతో పాటు మరికొన్ని యూరప్ దేశాలకు ఎక్కువగా మామిడిని ఎగుమతి చేస్తుంటారు. ఈ ఏడాది కూడా సుమారు 300 టన్నుల వరకు ఎగుమతి చేయాలని లక్ష్యంగానే నిర్దేశించుకున్నారు. కానీ, పంట ఆశించినంతగా లేకపోవడంతో ఎగుమతులు తగ్గనున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

ఈదురుగాల ప్రభావం



ఈదురుగాలులకు రాలిపోయిన తర్వాత మార్కెట్‌కు చేరిన మామిడి కాయలు

ఈ ఏడాది మామిడి ఫలసాయం ఆశించినంతగా లేకపోవడంతో రైతన్నలు ఆవేదనలో ఉన్నారు. నిండువేసవిలో సుడులు తిరిగే ఈదురుగాలు ప్రభావం మామిడి పిందెలపై పడింది. తీవ్రమైన గాలుల కారణంగా చెట్లకు ఉన్న కాయలు పక్వానికి రాకనే అధికంగా నేలపాలయ్యాయి. వీటికి మార్కెట్‌లో పెద్దగా గిరాకీ రాలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా మామిడిలో తీపి కాస్త తగ్గింది. దీంతో కొనుగోలు దారులు సైతం మధురఫలంపై పెద్దగా ఆసక్తి చూపడంలేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇష్టంగా తినేవారు కూడా ఇంత రేటు పెట్టి కొనుగోలు చేయడం ఎందుకని వెనుకంజ వేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు



గత ఏడాది కంటే ఇప్పుడు మామిడి పంట దిగుబడి చాలా తక్కువగా ఉంది. నాకు ఆరు ఎకరాల మామిడి తోట ఉంది. ఈ సంవత్సరం రెండు టన్నులు కూడా వచ్చే అవకాశం లేదు. పది రోజులు క్రితం గాలివానకు కొంత పంట నేలరాలింది. మామిడి తోటకు పెట్టిన ఎరువులు, మందుల ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ ఏడాది మామిడి రైతులకు నిరాశే. - వహీద్, రైతు, బంగారుపాళెం

దిగుబడి బాగా తగ్గింది..



నాకు నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. ఎకరాకి రూ. 30వేలు చొప్పున రూ.1.20లక్షలు ఖర్చు పెట్టా. కానీ దిగుబడి రాలేదు. పూత దశలోనే పిందెలు రాలిపోవడంతో దిగుబడి బాగా తగ్గిపోయింది. గత ఏడాది పూత బాగా రావడంతో 6టన్నుల దిగుబడి వచ్చింది. ఈసారి ఎకరాకు అరటన్ను కూడా వచ్చేలా కనిపించలేదు. మార్కెట్‌లో ఉన్న రేటును బట్టి చూస్తే నష్టమే.

- శరత్‌కుమార్, మల్లారెడ్డికండ్రిగ, విజయపురం మండలం

వ్యాపారులు సిండికేట్ అయ్యారు



వాతావరణ మార్పుల వల్ల అర కొరగా వచ్చిన పంటకు సరైన ధర ఉండడం లేదు. కంపెనీలతో పాటు వ్యాపారులు సిండికేట్ అయ్యారు. గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. దీనికి తోడు ఈదురుగాలులు, వడగళ్ల కారణంగా చేతికొచ్చిన పంట కళ్ల ముందే నేలపాలైంది. మామిడికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి .

- దేవరాజులు, రైతు, కార్వేటి నగరం

వాతావరణ పరిస్థితులే..



ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గింది. ఆలస్యంగా పూత రావటం, ఆ దశలోనూ రాలిపోవడం వల్ల దిగుబడిపై కనిపించింది. ఇందుకు వాతావరణ పరిస్థితులే కారణం. అందువల్లే నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోలేకపోయాం. రైతుల చేతికొచ్చే పంట కూడా పోయింది. ఈదురుగాలులతో తీవ్రంగా పంటకు నష్టం వాటిల్లింది.

- మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

క్లుప్తంగా

గోడకూలి ముగ్గురికి గాయాలు



గాయపడినవారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

చిత్తూరు అర్బన్: నగరంలోని బాపుబాల భవన్ పాఠశాల వీధిలో ఓ గోడ కూలడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లెకు చెందిన గోపి (36) డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఆయన, తన స్నేహితుడు వినోద్, ఓ పెద్దాయన మొదటి అంతస్తులోని ఓ షెడ్డులో పత్రాలు రాస్తున్నారు. ఉన్నట్టుండి కురిసిన వర్షానికి తొమ్మిది అడుగుల ఎత్తులో ఉన్న సిమెంటురాళ్ల గోడ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ కూడా రాళ్ల కింద చిక్కుకున్నారు. బాధితుల కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన వెళ్లి వారిని రాళ్ల కింద నుంచి బయటకు తీసుకువచ్చారు. 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

- 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 10,019 మంది విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలను జిల్లావ్యాప్తంగా 31 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం 7,442 మంది, ద్వితీయ సంవత్సరం 2,577 మంది, మొత్తం 10,019 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే పరీక్షలకు నిర్వహణకు సిబ్బందిని నియమించారు. డీఈసీ, హైపవర్ కమిటీ, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చి, వీటి ద్వారా ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా స్ట్రీమింగ్ చేశారు. పరీక్షలు తప్పినవారికి, మరిన్ని మార్కులు పొందేందుకు బెటర్‌మెంట్ కట్టిన విద్యార్థులకు కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా జూన్ 1వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం (రెండు సెషన్లుగా) నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఇంటర్మీడియట్ అధికారులు

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాలు ఇవీ..

జిల్లాలో మొత్తం 31 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో 30 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాల ఉన్నాయి. 24 కేంద్రాలలో ద్వితీయ సంవత్సరం పరీక్షలు, మిగిలిన 7 కేంద్రాలలో మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు.

నేడు సమన్వయ సమావేశం

సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ఇంటర్ బోర్డు అధికారులతో పాటు వైద్యఆరోగ్య శాఖ, ఆర్టీసీ, పోలీసు, పోస్టల్, రెవెన్యూ, మున్సిపల్, విద్య, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొననున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించనున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లా వ్యాప్తంగా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాం. ముఖ్యంగా మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాం. సప్లిమెంటరీ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరిస్తారు. అసిస్టెంట్ చీఫ్‌గా సీనియర్ లెక్చరర్ ఉంటారు. 350 మంది ఇన్విజిలేటర్లను పరీక్షల నిర్వహణకు నియమిస్తున్నాం.

- సయ్యద్ మౌలా, ఇంటర్ డీవీఈఓ, చిత్తూరు

అత్యంత జాగ్రత్తగా కౌంటింగ్

- సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా
- పకడ్బందీగా ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్



షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అత్యంత జాగ్రత్తగా కౌంటింగ్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు(ఆర్ఓ)లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

- జూన్ 4 వ తేదీ ఉదయం 5 గంటల నుంచే ఓట్ల లెక్కింపునకు కార్యాచరణ ప్రారంభిస్తాం.
- కౌంటింగ్ సిబ్బందిని తప్ప ఇతరులను ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతంలోకి అనుమతించం.
- ఆర్ఓలు తప్ప ఇతరులను మొబైల్ ఫోన్‌తో లోపలికి పంపించం.
- మీడియా కు ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం.
- ఎన్నికల సంఘానికి త్వరితగతిన సమాచారం అందించేందుకు హైస్పీడ్ ఇంటర్‌నెట్ కనెక్షన్ అందుబాటులోకి తీసుకువస్తున్నాం. పర్యవేక్షణకు సీనియర్ అధికారిని నియమిస్తున్నాం.
- కౌంటింగ్ కేంద్రంలో భద్రత కట్టుదిట్టంగా ఏర్పాటు చేశాం. 144 సెక్షన్ విధించాం.
- అనుమతిలేకుండా, ఐడీ కార్డు లేకుండా కేంద్రంలోని ఎవరినీ అనుమతించం.
- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గట్టి బందోబస్తు పెడుతున్నాం.
- స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను తీసుకెళ్లేందుకు ప్రత్యేక బారికేడ్‌లు ఏర్పాటు చేస్తున్నాం.
- అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే లెక్కింపు కేంద్రంలోనికి అనుమతిస్తాం.
- భద్రతలో భాగంగా మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశాం.
- లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ఫలితాలు వెల్లడించే వరకు మొత్తం బాధ్యతను రిటర్నింగ్ అధికారికి అప్పగించాం.



గంగమ్మ ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు



తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగజాతరకు భక్తులు పోటెత్తారు. జాతర చివరి రోజు కావడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొక్కుబడిలో భాగంగా మహిళలు వేపాకు చీరలు ధరించి.. ముఖానికి గంధపు బొట్లు పెట్టి.. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు పొర్లుదండాలు పెట్టి అమ్మవారిని సేవించారు. ఇంకొందరు జంతుబలులిచ్చి, భక్తులకు విందు భోజనాలు వడ్డించారు. కాగా.. మంగళవారం అర్ధరాత్రి తర్వాత అమ్మవారి విశ్వరూప దర్శనానికి ఆలయ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

వేపాకు చీరలు చుట్టి.. పొర్లు దండాలు పెట్టి!

- జనజాతరతో పులకించిన తిరునగరి
- తాతయ్యగుంట గంగజాతరకు పోటెత్తిన జనం
- భక్తిపారవశ్యంతో గంగమ్మకు పొంగళ్ల నివేదన
- జంతు బలులిచ్చి మొక్కులు తీర్చుకున్న స్థానికులు
- జాతర వేషాలతో సందడి చేసిన భక్తులు



అమ్మవారి సేవలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో జాతర కోలాహలం కొనసాగుతోంది. ఈనెల 14వ తేదీ రాత్రి చాటింపుతో మొదలైన గంగజాతర వారం రోజుల పాటు అత్యంత వైభవంగా సాగుతోంది. కనీవిని ఎరుగని రీతిలో రోజువారీ విభిన్న వేషాలతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీతాతయ్యగుంట గంగ జాతరను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతి గ్రామదేవత గంగమ్మ ఆలయ విశిష్టత, జాతర వైభవాన్ని మరింత వ్యాప్తి చేసేందుకు కంకణ బద్ధులయ్యారు. అనంతరం ఆయన అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించి గంగజాతర వైభవోపేతానికి శ్రీకారం చుట్టారు. తర్వాత వారం రోజుల పాటు శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లికి సారె సంప్రదాయం కొనసాగింది. జాతర చివరి రోజు కావడంతో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గంగమ్మ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నేత్రపర్వంగా మహాశాంతి అభిషేకాలు

సోమవారం అర్ధరాత్రి తర్వాత అమ్మవారికి మహాశాంతి అభిషేకాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు విశేష సంఖ్యలో భక్తులు వివిధ పౌరాణిక, జానపద, స్త్రీ వేషాలు ధరించి చిందులు వేస్తూ సందడి చేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ, అంబళ్లు పంపిణీ చేశారు.



వేపాకు చీరలు ధరించి అమ్మవారి దర్శనానికి తరలివస్తున్న మహిళలు

గంగమ్మను దర్శించుకున్న ప్రముఖులు

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రైల్వే కోడూరు ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ గంగమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగమ్మను సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి

శ్రీతాతయ్యగుంట గంగమ్మను ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి దర్శించుకున్నారు. ముందుగా వెయ్యి కళ్ల దుత్తలను శిరస్సుపై పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.



విశ్వరూప దర్శనం..పులకించిన భక్తజనం

గంగమ్మ జాతర మహోత్సవంలో చివరి రోజు మంగళవారం అర్ధరాత్రి తర్వాత విశ్వరూపంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలోని అమ్మవారి విశ్వరూప కొడి స్తంభం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. బంక మట్టితో సర్వాంగ సుందరంగా అమ్మవారి విశ్వరూప ప్రతిమ కొలువుదీరనుంది. అమ్మవారి విశ్వరూప ప్రతిమ తయారీలో కుమ్మరి, కంసాలి, విశ్వబ్రాహ్మణ, చాకలి, దళితులు వంటి అన్ని కులాల వ్యక్తుల సమ్మేళనంతో కొలువుదీర్చడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి విశ్వరూప ప్రతిమ చెంపను పేరంటాల వేషధారుడు నరకడంతో జాతర సమాప్తం కానుంది.

209 పొట్టేళ్లతో ఎమ్మెల్యే భూమన విందు భోజనం

గంగమ్మ జాతర చివరి రోజున ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి భక్తులకు మాంసాహార విందు భోజనాలు వడ్డించారు. సుమారు 209 పొట్టేళ్లతో తయారు చేసిన మాంసాహార భోజనాలను గ్రూప్ థియేటర్ వద్ద ఎమ్మెల్యేతోపాటు మేయర్ డాక్టర్ శిరీష సారథ్యంలో భక్తులకు స్వయంగా వడ్డించారు. అలాగే ఇందిరా మైదానంలో డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి సారథ్యంలో భక్తులకు మాంసాహార భోజనలు అందజేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులకు మాంసాహార భోజనాలు నిరంతరంగా పంపిణీ చేశారు.



గరిగతో నృత్యం చేస్తున్న భక్తుడు



అమ్మవారి సేవలో ఎమ్మెల్యే భూమన, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి